ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 16 అక్టోబరు 2025 | 7

వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఆకర్షణగా కేరళ కథాకళి నృత్యం.. (పక్కన) చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు దృశ్యం





సమ్మోహినీ రూపుడై...

సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు

వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు 8

దొరికారు!

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఆపరేటర్

భూమి సర్వే కోసం రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ రైడ్

కార్యాలయ సోదాల్లో అదనంగా రూ.5.85 లక్షల నగదు స్వాధీనం 9

లంచాల 'రెవెన్యూ'.. అదే మహా 'ప్రసాదం'



- మెయిన్‌లో

తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

'ఆయుర్వేదం' ఆగయా!



- కాకినాడకు ఆయుర్వేద కాలేజీ మంజూరు చేసిన కేంద్రం
- రూ.16 కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్న ఆయుష్ శాఖ
- జీపీటీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 50 పడకల ఆసుపత్రిలోనే ఏర్పాటు
- అక్కడే కాలేజీ నిర్మాణానికి రెండెకరాలు కేటాయించాలని కోరిన కేంద్రం
- 8 స్పెషాలిటీ కోర్సుల్లో 50 సీట్లతో మొదలుపెట్టి 100 సీట్ల వరకు అప్‌గ్రేడ్
- ఆయుర్వేద కాలేజీ రాకతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ఎంతో మేలు
- ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడలోనే ఆయుర్వేద కళాశాలలు

కాకినాడ సిగలో మరో వైద్య కళాశాల అందుబాటులోకి రాబోతోంది. ఆయుర్వేద వైద్యానికి డిమాండ్ నెలకొన్న తరుణంలో కాకినాడలో ఆయుర్వేద కాలేజీని మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగానికి సమాచారం అందించింది. రూ.16 కోట్ల వరకు ఖర్చయ్యే కాలేజీ ఏర్పాటుకు రెండెకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ఎంతో మేలు జరగనుంది. ఎంబీబీఎస్ తరహాలోనే నీట్ ద్వారా ఆయుర్వేద కాలేజీలకు అడ్మిషన్ లభిస్తుంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఆయుర్వేద వైద్యానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. అనేక ముదిరిపోయిన వ్యాధులను సైతం నయం చేస్తుందనే ప్రచారం దీనికి ఉంది. ఈనేపథ్యంలో దేశంలో వేల ఏళ్ల కింద ఉద్భవించిన ఈ వైద్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుర్వేద ఆసుపత్రులు, కాలేజీలను నిర్వహిస్తోంది. అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఉచితంగా, నామ మాత్రపు రుసుములతోను చికిత్సలు అందిస్తున్నారు. అందులోభాగంగా కాకినాడకు సైతం ఆయుర్వేద ఆసుపత్రిని కేంద్రం మంజూరుచేసింది. రూ.17 కోట్లతో దీన్ని కాకినాడ జీపీటీ ఆవరణలో 50 పడకల సామర్థ్యంలో నిర్మించారు. ఇక్కడ హోమియో, యోగా, యునానీ, ఆయుర్వేద చికిత్సలు అందించేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మాణం పూర్తి చేశారు. అయితే దీనికి అవసరమైన వైద్యుల నియామకం పూర్తి కాకపోవడంతో ఇంకా ఇది ప్రారంభం కాలేదు. అయితే ఉమ్మడి జిల్లాకు ఆయుర్వేద కాలేజీ అవసరాన్ని గుర్తించి గతేడాది కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపించారు. కొత్తగా ఆయుర్వేద మెడికల్ కాలేజీలను మంజూరు చేసే అవకాశం ఉండడంతో కాకినాడకు కొత్త కాలేజీ ఇవ్వాలని ప్రతిపాదనల్లో వివరించారు. పైగా ఇక్కడే 50 పడకల ఆయుర్వేద ఆసుపత్రి కూడా ఉన్నందున కాలేజీ కేటాయిస్తే బోధనాసుపత్రిగా ఉపయోగపడుతుందని వివరించారు. అటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కూడా కేంద్రంలో పలుదఫాలుగా మాట్లాడారు. ఈనేపథ్యంలో అనేక ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం ఎట్టకేలకు కేంద్రం కాకినాడకు ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆయుష్ విభాగం అధికారులకు తాజాగా సమాచారం అందించింది. ఈ కాలేజీ మంజూరైన నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.16 కోట్ల వరకు నిధులు మంజూరవనున్నాయి. తొలి విడత కింద రూ.7కోట్ల వరకు ఇవ్వనుంది. అయితే ఈ కాలేజీకి నిర్మించాలంటే రెండెకరాల స్థలం అవసరం. అయితే ప్రస్తుతం నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలోనే ఈ భూమి కావాలని కేంద్రం కోరుతోంది. ఈనేపథ్యంలో రెండెకరాల కేటాయింపునకు జిల్లా కలెక్టర్‌ను త్వరలో రాష్ట్ర ఆయుష్ అధికారులు కోరనున్నారు. కాలేజీ, ఆసుపత్రి ఒకే చోట ఉండాల్సిన అవసరాన్ని వివరించనున్నారు.

ఎన్ని ఉపయోగాలో...

ఆయుర్వేద కాలేజీలు రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడలో ఉన్నాయి. ఇప్పుడు మూడో కాలేజీ కాకినాడకు మంజూరు చేశారు. అయితే రాజమహేంద్రవరంలో హోమియో కాలేజీ ఉంది. కాకినాడలో ఆయుర్వేద మెడికల్ కాలేజీని కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీకి తొలుత యాభై సీట్ల వరకు కేంద్రం అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాత వంద సీట్లకు అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. అచ్చం ఎంబీబీఎస్ తరహాలోనే ఆయుర్వేద మెడికల్ కాలేజీలో సీటు కోసం నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటుకానున్న ఆయుర్వేద కాలేజీలో ఎనిమిది వరకు స్పెషలిస్ట్ విభాగాల్లో ఆయుర్వేద విద్యను బోధించనున్నారు. ప్రధానంగా కాయ, శల్యతంత్రం, ప్రసూతి, బాలరోగ, సంహిత, పంచకర్మ, అనాటమీ, ఫిజియాలజీ విభాగాల్లో నాలుగున్నరేళ్ల ఆయుర్వేద విద్యను బోధిస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి కాలేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇదిలాఉంటే కాకినాడలో నిర్మాణం కానున్న ఆయుర్వేద కాలేజీ, అనుబంధ ఆసుపత్రి వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అనేకమంది రోగులకు వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం అనేకమంది మొండి వ్యాధులు, ఇతర అనారోగ్యాలకు ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ, మంచి ఫలితాలు ఉండడంతో ఆయుర్వేద చికిత్స అందించే పలు ప్రైవేటు ఆసుపత్రులకు సైతం గిరాకీ అధికంగా ఉంటోంది. ఈనేపథ్యంలో కాలేజీ రాకతో అనేకమందికి అతి తక్కువ ఖర్చుతో అనేక దీర్ఘకాలిక, చిన్న చిన్న అనారోగ్యాలకు సైతం చికిత్స అందనుంది.

కాకినాడలో కొత్తగా నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి

కొడుకులను కడతేర్చి.. తాను అంతమై..

- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- ఆలమూరు మండలం చిలకలపాడులో దారుణం 9



పావులూరి కామరాజు, కుమారులు అభిరామ్, గౌతమ్

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే దుకాణాల సీజ్

- డీఆర్వో మాధవి

అమలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు చేపట్టేవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు షాపులను సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడబోమని ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 20న దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కొనుగోళ్లు ప్రజలు పెద్దఎత్తున చేయనున్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకుని బాణసంచా విక్రయదారులు అక్రమ నిల్వలతోపాటు అనుమతులు లేకుండా విక్రయించే అవకాశం ఉందని, అటువంటి వాటిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, పౌరసరఫరాలు, విద్యుత్ తదితరశాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ బాణసంచా విక్రయాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు గుర్తించి సూచించిన ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు వేసుకోవాలని, పట్టణప్రాంతాల్లో టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బాణసంచా విక్రయాల్లో భద్రతాపరమైన లోపాలకు అవకాశం లేకుండా పటిష్టచర్యలు చేపట్టామని ఆమె తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా విక్రయ కేంద్రాలవద్ద అగ్నిమాపక ఇంజన్ల ఏర్పాటుతోపాటు అగ్నినిరోధక పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి విక్రయదారుడు లైసెన్సు కలిగి ఉండాలని, నివాస ప్రాంతాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, మార్కెట్లు వంటి ప్రదేశాలకు దూరంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితోపాటు బాలయోగి స్టేడియంలో పరిమితికి మించి దుకాణాలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజోలు పర్యటన వాయిదా

- దీపావళి తరువాతే పర్యటిస్తారు: రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్


మలికిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజోలు పర్యటన వాయిదా పడిందని, దీపావళి తర్వాత ఆయన పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే దేవవరప్రసాద్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన, మరోవైపు వాడపల్లి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్భంగా పోలీసుబలగాలు ఆయా కార్యక్రమాలకు వెళ్లడంతో పవన్ పర్యటన వాయిదా పడినట్టు తెలిసింది. దీపావళి పండుగ తరువాత మలికిపురం మండలం కేశనపల్లి తీరగ్రామాల్లో తోటల పరిశీలన, అనంతరం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తెలిపారు.

26న యానాంలో సాహితీ పురస్కారాల ప్రదాన సభ 9

ఘనంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

- దోషాల నివారణకు బాలబాలాజీ సన్నిధిలో మూడురోజులపాటు నిర్వహణ

మామిడికుదురు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలోఉన్న అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మూడురోజులపాటు జరిగే పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేనారాధనతో ఈ పవిత్రోత్సవాలకు అర్చకులు అంకురార్పణ చేశారు. పుట్టమట్టితో కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా కన్నుల పండుగగా జరిపించారు. ఆలయ పవిత్రతకు ఎటువంటి లోపం లేకుండా దోషాలు నివారించేందుకు తెలిసీ తెలియక చేసిన తప్పులు, దోషాల నుంచి పరిహారం కోరుతూ మూడురోజులపాటు ఈ పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. శ్రీవారిలో విశేషమైన తేజస్సు కోసం నిర్వహించే ఈ ఉత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చినజీయర్‌స్వామివారి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఈఉత్సవాల్లో భాగంగా నవకలశ పంచామృత సుగంధద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయప్రాంగణాన్ని గోదావరిజలాలతో సంప్రోక్షణ చేసి భక్తుల కోలాహలం, మేళతాళాలు, గోవిందనామస్మరణల నడుమ ఉత్సవమూర్తులను, పవిత్రాలను పూజాద్రవ్యాలను వేదిక వద్దకు అర్చకులు ఆలయ సిబ్బంది ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మరో రెండురోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు పూజల్లో పాల్గొనాలని సహాయ కమిషనర్ కోరారు.



అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ అధ్యక్షుడిగా ముక్తేశ్వరరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ కలెక్టరేట్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావును బుధవారం పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, కార్యదర్శి కె.మల్లిబాబు, అమలాపురం తాలూకా అధ్యక్షుడు పి.కామేశ్వరరావు,రామచంద్రపురం తాలూకా అధ్యక్షుడు కొమ్ముల స్వామినాయుడు తదితరుల ఆధ్వర్యంలో ముక్తేశ్వరరావును ఘనంగా సత్కరించారు.



ముక్తేశ్వరరావును అభినందిస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

రాష్ట్రీయ పండుగగా సంక్రాంతి సంబరాలు



ఎస్.యానాం బీచ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

- అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు
- టూరిజంశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- ఆత్మీయ ఆతిథ్యంతో సంబరాలను ప్రోత్సహించాలన్న కలెక్టర్
- బీచ్‌లో వేగవంతంగా ఆడిటోరియం, రెస్టారెంట్‌ల నిర్మాణ పనులు

ఉప్పలగుప్తం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా గోవా ఎస్.యానాం బీచ్‌లో రాష్ట్రీయ పండుగగా సంక్రాంతి సంబరాల నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఈ మేరకు పర్యాటకశాఖకు ఆదేశాలిచ్చారన్నారు. బీచ్‌లో 2026-సంక్రాంతి సంబరాల నాంది కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. గత సంబరాలకు ఊహించిన దానికంటే ఎక్కువమంది పర్యాటకులు వచ్చారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. బీచ్ సమీపంలో ఎకరం స్థలంలో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. బస్టాండ్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆడిటోరియం నిర్మాణ పనులను, నిర్మాణంలోఉన్న రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే ఆనందరావు కలెక్టర్‌కు చూపించారు. సంక్రాంతి సంబరాలకు అన్నివిధాలా సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. సంక్రాంతి సంబరాలకు పర్యాటకుల సంఖ్య స్థానికుల ఆత్మీయ ఆతిథ్యంపైనే ఆధారపడి ఉంటుందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఎస్.యానాం బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే ఆనందరావు ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. బీచ్ అభివృద్ధి చెందితే గ్రామం అభివృద్ధి చెందుతుందన్న అంశాన్ని గ్రామస్తులు గ్రహించాలన్నారు. తీరప్రాంత గ్రామంలో దూరప్రాంత పర్యాటకులకు రెస్ట్‌రూమ్‌లు లభించే అవకాశం లేనందున హోంస్టేలు ఏర్పాటు చేసేందుకు అవకాశాలను పరిశీలించాల్సి ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఉప్పలగుప్తం వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయలక్ష్మి, కూటమి నాయకులు పలచోళ్ల పద్మనాభం, సత్తి చిన్నా, ఇసుకపట్ల రఘుబాబు,పలచోళ్ల బుజ్జి, పినిశెట్టి నరసింహారావు, పలచోళ్ల నారాయణరావు, పీఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ రాజ్‌కుమార్, డ్వామా పీడీ మధుసూదన్, ఏపీడీ రాంబాబు పాల్గొన్నారు.

25 వరకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు అవకాశం

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష అప్లికేషన్లు డీఈవో కార్యాలయంలో అందించేందుకు ఈనెల 29వతేదీ ఆఖరు అని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 3074 మంది విద్యార్థులు అప్లికేషన్లు సమర్పించారన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి విద్యార్థులు అర్హత పరీక్ష రాయడానికి ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని, 27లోపు ఫీజు చెల్లించాలని, అప్లికేషన్‌ను 29లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం 8వతరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. మేనేజ్‌మెంట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ 7వతరగతిలో 55శాతం మార్కులు పొందినవారు ఎస్సీ, ఎస్టీలైతే 50శాతం మార్కులు వచ్చినవారు, కుటుంబసంవత్సర ఆదాయం రూ.3లక్షల50వేలలోపు అర్హులన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, తండ్రి పేరును అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌లో లేదా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో వెండర్ డెవలెప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఈ శిబిరంలో 150మంది కొనుగోలుదారులు, అమ్మకందారులు పాల్గొని సుహృద్భావ వాతావరణంలో అవగాహన పొందారన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ వీడీపీ ప్రోగ్రాం కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో చిన్న, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికోసం ఏర్పాటు చేసిందన్నారు. స్థానికంగాఉన్న పరిశ్రమలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో అనుసంధానించడంతోపాటు స్థానికంగా లభ్యమయ్యే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రధాన లక్ష్యంగా కార్యక్రమం చేపట్టామన్నారు. కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు, క్వాయిర్, జ్యూట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పథకంతో అనుసంధానంగా ఉండి జిల్లా ఉత్పత్తులు, మార్కెటింగ్ ఎగుమతులు, కొత్త మార్గాలకు నాంది పలికిందన్నారు. ఎంఎస్ఎంఈలకు విదేశాల కంపెనీలతో మార్కెటింగ్ అవగాహన కల్పిస్తూ గెయిల్ టెండర్లలో 25శాతం అవకాశాలు చిన్న పరిశ్రమలకు కేటాయించినట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పర్యాటకం, గార్మెంట్స్ తయారీ, పాడిపరిశ్రమల అభివృద్ధికి అవకాశాలున్నాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే ఏపీఐఐసీ, సీఎస్సార్ ద్వారా అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గెయిల్ టెండర్లలో 25శాతం ఎంఎస్ ఎంఈలకు ఇచ్చే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. వెండర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ సంప్రదింపుదారులు వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చిరు ధాన్యం





(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కాకినాడ నగరంతో పాటు పలు పట్టణాల్లో చాలా మంది అన్నం, అల్పాహారం, ఇతర చిరుతిళ్లకు బదులుగా చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలు తినేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. దాంతో పట్టణాలు, పల్లెల్లో క్రమంగా భోజన, అల్పాహారశాలల మాదిరిగానే రాగి జావ, మొలకలు, పళ్ల సలాడ్‌లు విక్రయించే దుకాణాలు బాగా విస్తరిస్తున్నాయి.



మంచి ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. కాలానుగుణంగా జీవనశైలిలో వస్తున్న మార్పులతో ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయి. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వేధిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తప్పించుకునేందుకు ప్రత్యేక ఆహారంపై ఆధారపడుతున్నారు. రెగ్యులర్ రొటీన్ ఫుడ్‌ను పక్కనపెట్టి.. సంప్రదాయ ఆహార అలవాట్ల దిశగా అడుగులు వేస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రత్యేక నియమ, నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యానికి మేలు చేసే పౌష్టికాహారాన్నే తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత ముందు జాగ్రత్తగా... ఎటువంటి రోగాలూ తమ దరిచేరకుండా ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు.

- మారుతున్న ఆహారపు అలవాట్లు
- నగరాలు, పట్టణాల్లో పెరిగిన మిల్లెట్స్ సంస్కృతి
- సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఫుడ్‌పై ఆసక్తి
- ఉదయాన్నే సేవిస్తున్న యువత

కాకినాడ నగరంలోని వివేకానంద పార్కు చుట్టుపక్కల, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేఎన్టీయూ, జిల్లా క్రీడా మైదానం సమీపాల్లో ఈ దుకాణాలను ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఓదెలు, అరికెలు, రాగులు వంటి చిరుధాన్యాల వంటకాలు, జావ తీసుకుంటున్నారు. పచ్చి కూరగాయలైన బెండకాయ, బీరకాయ, సొరకాయ, బీట్‌రూట్, కేరెట్, బూడిద గుమ్మడికాయ వంటి జ్యూస్‌లను సైతం సేవిస్తున్నారు. వాకింగ్, వ్యాయామం చేసేందుకు పార్కులు, ఇతర క్రీడా మైదానాలకు వచ్చేవారు ఈ తరహా ఫుడ్ తీసుకుంటున్నారు. కొవ్వు పదార్థాలను పూర్తిగా దూరం పెడుతున్నారు. వీటిని తీసుకునేందుకు యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

మన శరీరానికి ఆరోగ్యకరమైన పోషకాలను అందించే వాటిలో తృణధాన్యాలు కూడా ఒకటి. అందులో ప్రధానమైనవి రాగులు. వీటిని ఏదో ఒక రూపంలో తీసుకుంటే మంచి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. రాగి ముద్ద, రాగి రోటీ, రాగి గంజి, అంబలి... ఇలా పలు రకాలుగా తయారు చేసుకుని తింటారు. మిల్లెట్లో కాల్షియం పుష్కలంగా ఉండడంతో ఎముకలను దృఢంగా చేయడానికి సహాయపడుతుంది. రాగులు పిల్లల శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. వృద్ధులు, మహిళల ఎముకల బలానికి మంచి మెడిసిన్ అని చెప్పాలి.

రాగి జావను రోజూ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. రాగుల్లోని పోషకాలు...



ముఖ్యంగా ప్రొటీన్లు, విటమిన్లు, ఏ, బీ, సీ, మినరల్స్ మన శరీరానికి బలాన్ని ఇస్తాయి. దీంతో జీర్ణశక్తి పెరుగుతుంది. రాగుల్లో ఉండే అమైనో ఆమ్లాలు ట్రిప్టోఫాన్ ఆక లిని తగ్గిస్తుంది. బరువును అదుపులో ఉంచుతుంది. మిల్లెట్ పిండితో చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అలాగే గుండె జబ్బులు, ఉబ్బసం వంటివి తగ్గుతాయి. రాగులు తీసుకోవడం వల్ల చర్మం, మెరుస్తూ మృదువుగా ఉంటుంది. మధుమేహాన్ని కంట్రోల్ చేస్తుంది. అలాగే రక్త హీనతను దూరం చేస్తుంది.

నగర జీవనం ఒత్తిడితో కూడినది. నిత్యం ఉరుకులు, పరుగుల మధ్య సాగుతుంది. దీనికి తోడు పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్ వంటి ఫాస్ట్ ఫుడ్ వినియోగం అధికం కావడంతో మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక సమస్యలు ప్రస్తుతం అందరిలోనూ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సహజసిద్ధమైన, పోషక విలువలున్న ఆహారం వైపు దృష్టిసారిస్తున్నారు. జంక్ ఫుడ్ తెచ్చిన ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు పాతకాలపు ధాన్యాలవైపు ఆశగా చూస్తున్నారు.

ముఖ్యంగా యువత హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో వీటిని స్టాళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీటిని విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రజలు తమ ఆహారపు అలవాట్లుగా మార్చుకున్నారని వారు చెప్తున్నారు. మొదట్లో అంతగా ఆదరించలేదు. గత ఐదేళ్లుగా వినియోగదారుల డిమాండ్ పెరిగింది.



మొలకెత్తిన విత్తనాలు, నువ్వుల ఉండలు, వేరుశెనగ ఉండలు, చిక్కీలు, ఉడకబెట్టిన గుడ్లు విక్రయిస్తున్నారు.





పండ్ల రసాలే కాదు... పచ్చి కూరగాయల రసాలు కూడా...

సాధారణంగా పండ్ల రసాలను తీసుకునే వారిని చూస్తుంటాం. యాపిల్, పైనాపిల్, బత్తాయి, బనానా, ద్రాక్ష, సపోటా, బొప్పాయి వంటి జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లకు ప్రాధాన్యమిచ్చే జనం ప్రస్తుతం పచ్చి కూరగాయల రసాలు సేవించేందుకు వెనుకాడడం లేదు. ఉదయాన్నే పరగడుపున బీట్‌రూట్, క్యారెట్, బూడిదగుమ్మడికాయ, కీరదోసకాయ, సొరకాయ, కాకరకాయ, బెండకాయ, బీరకాయ వంటి జ్యూస్‌లను సేవిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ రూ.40 నుంచి రూ.60కి ఇక్కడ విక్రయిస్తున్నారు.

నన్నయలో ఘనంగా ఆహార మహోత్సవ్

- తొలి రోజు 'తూర్పు' ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు
- నేడు 'పశ్చిమ' వంటకాల ప్రదర్శన



వంటకాలను రుచి చూస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేవిధంగా ఈ ప్రాంత ప్రజల వంటకాల గొప్పతనాన్ని ఇనుమడింపజేయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 'ఆహార మహోత్సవ్' నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి నన్నయ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మన వారసత్వ సంపదను, సంప్రదాయాలను, వంటకాలను, గోదావరి జిల్లాల వంటకాల గొప్పతనం తెలియజేయడమే ఈ ఆహార మహోత్సవ లక్ష్యమన్నారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా వాసులు ఆహార మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. న్యాయనిర్ణేతలుగా జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ కోమలి, రసాయనశాస్త్రం అధ్యాపకురాలు బీబీ నళినీ, గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వత వర్ధినీ, సత్యదేవ నర్సరీ యజమాని శ్రీలక్ష్మీసత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ నుంచి ఎస్.పుష్పలత, హాజరై ఆహార పదార్థాలను పరిశీలించారు. శాఖాహార వంటల విభాగంలో బి.ప్రశాంతిశ్రీ బృందం ప్రథమ, పి.శిరీష బృందం ద్వితీయ, కె.మమత తృతీయ బహుమతులు సాధించారు. మాంసాహార వంటల విభాగంలో బాలుర వసతిగృహం విద్యార్థులు ప్రథమ, బి.లక్ష్మి ద్వితీయ, వై.బాబి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డి.కళ్యాణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, హైకోర్టు న్యాయవాది ఎ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహార మహోత్సవ్‌లో సందడిగా మారిన స్టాల్స్

జాతీయ బాక్సింగ్ పోటీలకు నిహారిక ఎంపిక



ద్రాక్షారామ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు కారుమూరి నిహారిక ఎంపికైంది. రాజమహేంద్రవరం ఎస్కేవీటీ హైస్కూలులో ఈ నెల 11 నుంచి 14 వరకు అండర్-14, 17 విభాగాల్లో 69వ శాప్ స్కూలు గేమ్స్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. సుమారు 2వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన రత్నం కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థిని కారుమూరి లేఖనిహారిక ఫైనల్ ఫైట్‌లో విశాఖపట్నంలోని సాయి అకాడమీకి చెందిన అమ్మాయితో తలపడి ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం కైవశం చేసుకుందని, ఈ నెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అడ్మిన్ సెక్రటరీ వి.భువనేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీడీ ప్రసాద్ పేర్కొన్నారు.





శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు

మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు

సమ్మోహినీరూపుడై...

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు
- వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందిన అశేష భక్తజనం
- వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన బుధవారం వేకువజామున సుప్రభాత సేవ, నవనీత హారతిలతో స్వామివారిని మేల్కొల్పారు. అనంతరం వసంత మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తోడ్కొనివచ్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, హోమాలను వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 10.34 గంటలకు శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని తరించారు. కేరళ వాయిద్యాలు, కథాకళి, నాగాలాండ్ కళాకారుల వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీవేంకటేశ్వర మూలమంత్రపూర్వక వేంకటేశ్వరస్వామి హోమాలను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.10 గంటలకు మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై అధిష్ఠించి తిరువీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని కనులారా చూసి తన్మయత్వం పొందారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు



చంద్ర ప్రభ వాహన సేవను తిలకిస్తున్న అశేష భక్తజనం



భక్తులకు వీనులవిందు చేసిన నాగాలాండ్ కళాకారుల వాయిద్య ప్రదర్శన

వసుధైక కుటుంబంతో ప్రపంచ సమగ్రత

'గెయిల్' చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు.. ఎస్‌కేవీటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ తాత్వికతలోని వసుధైక కుటుంబ సూత్రం ప్రపంచ సమగ్రతకు మార్గదర్శి అని గెయిల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్‌రావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీఎస్ రావు మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పునరుజ్జీవనమే సమగ్రశాంతికి, సమతుల్యతకు, నిజమైన నిధులు అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గెయిల్ ఇండియా డివిజనల్ మేనేజర్ హెచ్‌ఆర్ దివి ప్రభాకర్‌తో పాటు ఖగోళశాస్త్రంపై చీమలమర్రి శ్రీనివాసరావు, నాట్యశాస్త్రంపై సప్పా దుర్గాప్రసాద్, ఆయుర్వేదంపై సూర్యరఘురాం, వివిధ అంశాలపై పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధకులు, ఆధ్యాత్మికవేత్తలు, తమ అభిప్రాయాలను, 125 గోష్ఠిపత్రాలను సమర్పించారు. ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, అధ్యాపకులు పసుపులేటి శ్రీరామ్మూర్తి, డీవీ రమణమూర్తి, పీవీబీ సంజీవరావు, మధులత, లలిత రమ్య శిల్ప పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొవ్వూరులో హాల్ట్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (నెం.17219/17220), విశాఖపట్నం-కడప ఎక్స్‌ప్రెస్ (నెం.18521/18522) రైళ్లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్టు ఇచ్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాసిన లేఖకు రైల్వే అధికారులు స్పందించి సమాచారం అందిస్తూ, త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. కొవ్వూరు, పరిసర ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ రెండు రైళ్లు కొవ్వూరులో ఆపాలని ఎంపీ పురందేశ్వరి చేసిన కృషి ఫలించిందని రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత అధ్యక్షతన బుధవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు,చార్జిషీట్లు ఫైల్ చేసే సమయంలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై సూచనలు చేశారు. బెయిల్/ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సిఫార్సులు చేశారు. డీఎల్ఎస్ఏ కార్యాచరణ, బాధితుల పరిహార కేసులపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.24.72 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ద్రాక్షారామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. జూలై 5 నుంచి అక్టోబరు 15 వరకు 102 రోజులకుగాను ఆలయంలోని హుండీల ద్వారా రూ.24,72,056 ఆదాయం లభించింది. బంగారం 2.200మిల్లీగ్రాములు, వెండి 99 గ్రాములు వచ్చింది. అన్నదాన హుండీ ద్వారా రూ.1,64,675 వచ్చినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభానీ విలేఖరులకు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో, రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్‌ప్రసాద్, గంగవరం టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు ఈవో వైవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ కార్యక్రమంలో పెంకే సాంబశివరావు, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటితో రోగాలు దూరం

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందిస్తే కొన్ని రోగాలు దరిచేరవని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ కేవీస్వీ ప్రసాదరావు అన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు 8వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసాదరావు శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీనా, విశ్రాంత ఎస్ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, డీఈఈ స్వామి, డీఎల్పీవో అమ్మామణి, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో బెరా యూనిట్ ప్రారంభం



జీజీహెచ్‌లో బెరా యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్య

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగంలో బ్రెయిన్‌స్టెమ్ ఇవోక్డ్ రెస్పాన్స్ ఆడియో మెట్రీ యూనిట్(బెరా)తో పాటు నూతనంగా పునరుద్ధరించిన సౌండ్ ప్రూఫ్ ఆడియో మెట్రీ గదిని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెరా పరీక్ష.. విషయపరంగా ఆధారపడని(ఆబ్జెక్టివ్) శ్రవణ పరీక్షా విధానమన్నారు. ఇది చెవిలో నుంచి మెదడు వరకు ఉన్న శ్రవణ మార్గం స్పందనలను నమోదు చేస్తుందన్నారు. ఈ పరీక్ష నవజాత శిశువులు, పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు అలాగే సహకరించలేని రోగుల్లో వినికిడి స్థాయిని అంచనా వేసేందుకు ఉపయోగకరమన్నారు. ఇది మాలింగ రింగ్ (నకిలీ వినికిడి లోపం) గుర్తించడంలో, మెడికో లీగల్ అలాగే దివ్యాంగుల అంచనా సందర్భాల్లో వినికిడి పరిమితులను కచ్చితంగా నిర్ధారించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ పి.విజయదీప్తి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహర్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

కొడుకులను కడతేర్చి.. తాను అంతమై..

- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో కలకలం రేపిన సంఘటన
- ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో
- బంధువుల వేధింపులే కారణమని ప్రస్తావన



మరణించిన కామరాజు, కుమారులు అభిరామ్, గౌతమ్ (ఫైల్)

ఆలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం తెల్లవారుజామున ఓ తండ్రి తన కుమారులను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

చిలకలపాడుకు చెందిన పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) సెలూన్ షాపు నిర్వహిస్తూ తన కుమారులు అభిరామ్(11), గౌతమ్ (8)తో కలసి జీవిస్తున్నాడు. అభిరామ్ ఐదో తరగతి, గౌతమ్ ఒకటో తరగతి మడికిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. అయితే నాలుగేళ్ల క్రితం కామరాజు భార్య పావులూరి నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. బుధవారం తెల్లవారుజామున తన కుమారులు ఇద్దరికి కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చిన తదుపరి కామరాజు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని బంధువులు గుర్తించి ఆలమూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్, సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. అయితే చిన్నారులు అభిరామ్, గౌతమ్ మృతిచెందిన విధానంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి నోటి నుంచి ఎటువంటి నురగలు రాకపోవడంతోపాటు ఎక్కడ పడుకున్నవారు అక్కడ ఉన్నారు.. విషం తాగిస్తే అలా పడుకుని ఉండలేరని వాదన ఉండడంతో పూర్తిస్థాయి విచారణ చేయాలని క్లూస్ టీమ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్ ఐ జినరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ వీడియో...

కామరాజు ఆత్మహత్య చేసుకునే ముందు చేసిన సెల్ఫీ వీడియో కీలకంగా మారనుంది. "నా కుమారులు, నేను ఆత్మహత్య చేసుకుని మృతి చెందుతున్నాం.. దీనికి ప్రధాన కారణం నా భార్య సమీప బంధువులైన ముగ్గురు వ్యక్తులు (పేర్లను ప్రస్తావిస్తూ). వారు తరచూ నన్ను వేధింపులకు గురి చేస్తుండడంతో పాటు నన్ను హతమార్చడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు, బంధు వులను కూడా దూషిస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు" అని కామరాజు ఆ వీడియోలో పేర్కొన్నాడు. కుమారుడు, మనవుల మృతి పట్ల కామరాజు తల్లితో పాటు బంధువులు విలపించారు.



అభిరామ్, గౌతమ్ మృతదేహాలు

నాలుగేళ్ల కిత్రం భార్య కూడా..

కామరాజు భార్య నాగలక్ష్మి నాలుగేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. దీంతో మరణానికి కామరాజే కారణమని నాగలక్ష్మి బంధువులు ఆరోపించడంతో అతడిపై ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం కామరాజు తన కుమారులకు చంపి, తాను ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. కుటుంబంలోని నలుగురు ఒకే రకంగా మృతిచెందడంతో సంచలనం కలిగించింది. నలుగురి మరణాలపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కాకినాడలో రెండు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని రెండు స్కానింగ్ సెంటర్లపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వాటి పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసినట్టు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జన్మభూమి పార్క్ సమీపంలోని యూఎస్ ఉమెన్ కేర్ ఫెర్టిలిటి క్లినిక్, అలాగే నూకాలమ్మ గుడి సమీపంలోని వెంకటేశ్వర స్కాన్ సెంటర్ పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్ల రద్దు ఈ నెల 14వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని డీఎంహెచ్‌వో తెలిపారు. కాకినాడ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి స్కానింగ్ కేంద్రాల సమాచారం లేదా నమోదు కాని స్కానింగ్ కేంద్రాలు అలాగే అర్హత లేని వైద్యుల వివరాలు టోల్ ఫ్రీ నెంబర్ (1800 4253365) లేదా వాట్సాప్ నెంబర్ 9494 113365కు గాని తెలియపర్చినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మహ్మద్ జాఫర్ (ఫైల్)

గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుకనుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం శివారున బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పి.మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు పట్టణానికి చెందిన మహ్మద్ జాఫర్ (41) సమిశ్రగూడెంలో గతంలో వర్క్‌షాపులో పనిచేసేవాడు. అయితే 3 నెలల క్రితం కంచర్లగూడెం-జగన్నాధపురం గ్రామాల మధ్య ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో ఫిట్టరుగా చేరాడు. బుధవారం సాయంత్రం గోపాలపురం నుంచి ఫ్యాక్టరీ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో జాఫర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన గూడ్స్ లారీ ఆగకుండా వెళ్లిపోగా వెంబడించి మెట్ట వద్ద డ్రైవర్‌తో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలియజేశారు.

ఏపీ ఉమ్మడిగా ఉంటేనే బాగుండేది..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

- కలిసున్నప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- విభజన తర్వాత తెలుగు రాష్ట్రాల స్థానమేంటో చూడండి
- పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి : ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉంటేనే బాగుండేదని.. తాను ఇప్పటికీ అదే కోరుకుంటున్నానని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ నేత ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉండేదని, కానీ.. విభజన తర్వాత ఈ రెండు రాష్ట్రాలు ఏ స్థానాల్లో ఉన్నాయో చూడాలని వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కలసి ఉంటే కలదు సుఖం. అందుకే తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగానే ఉండాలని కోరుకున్నాను. అలా ఉంటేనే బాగుండేది. ఇప్పటికీ నేను అదే మాటపై ఉన్నాను' అని అన్నారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దాని వల్ల 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని, 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం తన హయాంలోనే టెండర్లు పిలిచానని గుర్తుచేశారు. కృష్ణా జలాలపై 1976 బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఏపీ వాడుకోవచ్చని చెప్పారు. కానీ, ట్రిబ్యునల్ ఆర్డర్‌ను పునఃపరిశీలన చేయాలని తెలంగాణ అడుగుతోందని, దీనిపై మన ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. తాను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడానని.. నీరు ఉన్నప్పుడు ఫర్వాలేదు కానీ నీరు లేనప్పుడు సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పానని అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇద్దరూ కలసికట్టుగా ఆలోచన చేసి ఈ విషయంలో కోర్టులో గెలవడం ముఖ్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, అయితే మరింత వేగం అవసరమని అన్నారు. ప్రధాని మోదీ కూడా రాష్ట్రానికి సహకారం అందిస్తున్నారని, ఇది మరింత పెరగాలని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో నిందితుడుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఐక్యరాజసమితి సమావేశాలకు పంపడంపై కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ... పార్లమెంట్ వేరు, కేంద్రం వేరని.. న్యాయశాస్త్రం ప్రకారం శిక్ష పడేవరకూ ఎవరినీ దోషి అనలేమని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లంచాల 'రెవెన్యూ'.. అదే మహా'ప్రసాదం'!

- సర్టిఫికెట్ కావాలంటే సొమ్ములు చెల్లించాల్సిందే
- ఎఫ్‌లైన్ సర్వేకు రూ.లక్ష డిమాండ్
- అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న లంచాల బాగోతం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- తాజాగా అమలాపురంలో రూ.50వేలు లంచంతో పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

అమలాపురం/అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పారదర్శకంగా పౌర సేవలు అందిస్తున్నట్టు ప్రకటిస్తున్నప్పటికీ ఆ సేవలను పొందాలనుకునే ప్రజలు మాత్రం రెవెన్యూ అధికారులకు భారీగా లంచాలు సమర్పించుకుంటే గానీ పని ముందుకు వెళ్లడం లేదు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా దానికో రేటు నిర్ణయిస్తున్నారు. ఆ రేటుతో ఏ రూటులో వెళ్లాలో కూడా కిందిస్థాయి రెవెన్యూ యంత్రాంగమే సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల నుంచి తహశీల్దార్ల వరకు భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇటీవల విద్యా సంవత్సరం ప్రారంభసమయంలో ఈడబ్ల్యూసీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నవారి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారు. ఇది ఒక కోనసీమ జిల్లా అమలాపురంలోనే కాదు అన్ని కేంద్రాల్లోను ఈ తరహా దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలు శూన్యం. కాగా అమలాపురం తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా సర్టిఫికెట్‌కు రూ.2వేలు లంచం ఇస్తే తప్ప డిజిటల్ సైన్ పడేది కాదు. కార్యాలయాల్లో పని చేసే చిరుద్యోగులనే కలెక్షన్ ఏజెంట్లుగా పెట్టుకుని వసూళ్ల దందా కొనసాగించారనడానికి బుధవారం కోనసీమ జిల్లా అమలాపురం తహశీల్దార్ కేంద్రంలో జరిగిన ఏసీబీ రైడే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, కలెక్షన్ ఏజెంట్‌గా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ రాములు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజోలు ప్రాంతానికి చెందిన గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమితం రూ.50వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. లంచం సొమ్ముతో పాటు అదనంగా కార్యాలయంలో రూ.5.85 లక్షల సొమ్మును కూడా ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ సొమ్ము కూడా భూముల సర్వే నిమిత్తం బుధవారం వచ్చిన కలెక్షనే అంటూ ప్రచారం జరుగుతుంది. రెవెన్యూశాఖలో డెత్ సర్టిఫికెట్లు, భూముల మ్యూటేషన్, భూముల సర్వే రీసర్వేలు, వీటితో పాటు ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాల సర్టిఫికెట్లు, ఇలా ప్రతీ పనికి ఒక రేటు పెట్టుకుని సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. పైగా ఇటీవలే తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమలాపురం డివిజన్ అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. అంతటి హోదాలో ఉండి అడ్డూ అదుపు లేకుండా లంచాల దందాలను కొనసాగిస్తున్నారనే విమర్శలు తహశీల్దార్ కార్యాలయం కేంద్రం గత కొన్ని నెలల నుంచి వెల్లువెత్తుతున్నప్పటికీ ఏ ఒక్క ఉన్నతాధికారి స్పందిండం లేదనే విమర్శలు ప్రజల నుంచి బాహటంగా వ్యక్తమవుతున్నాయి.


కనీస స్పందన ఏది..?

జిల్లా కేంద్రంగా ఉన్న అమలాపురంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోతో సహా ఎంతో మంది ఉన్నతాధికారులు ఉన్నా ఏనాడు తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేసి అక్కడే వేచి ఉండే ప్రజల్ని అడిగితే లంచాల మాటున సాగే ఎన్నో యథార్థాలు సాక్షాత్కరించేవని ప్రజలు బాహటంగా చెబుతున్నారు. ఇటీవల ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి సచివాలయం-3లో కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీమన్నారాయణ అనే వీఆర్వో మ్యూటేషన్ నిమిత్తం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అయితే ఆ సమయంలో అసలు సూత్రధారులను పక్కకు తప్పించడంలో కొందరు ఉద్యోగులు సహకరించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా కోనసీమ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో మామూళ్ల దందాలు పేట్రేగిపోతున్నప్పటికీ ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడంతో మరింత రెచ్చిపోయి దందాలను యథేచ్ఛగానే కొనసాగిస్తున్నారనడానికి అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన భారీ అవినీతే అద్దం పడుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా కార్యాలయంలో అదనంగా దొరికిన రూ.5.88లక్షలు నగదు ఎక్కడదనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీసే క్రమంలో కామనగరువు లేఅవుట్‌లో ఉంటున్న తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి సోదాలు కొనసాగిస్తున్నారు. కాగా రెవెన్యూ అధికారుల అవినీతి అమలాపురం కేంద్రంగా బట్టబయలు కావడంతో మిగిలిన ప్రాంతాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ఇదీ తహశీల్దార్ అవినీతి బాగోతం...

15 సెంట్ల భూమి ఎఫ్‌లైన్ సర్వేకు అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ రూ.లక్ష డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో రూ.50వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు నేరుగా దాడి చేసి పట్టుకున్నారు. దాడి సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో అదనంగా లెక్కలు చూపని రూ.5,88,500 నగదు ఉండడాన్ని గుర్తించారు. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం సమీపంలోని రాజవోలు గ్రామానికి చెందిన గంధం దుర్గా కొండలరావుకు అమలాపురంలో 15 సెంట్ల స్థలం ఉంది. కొండలరావు తండ్రి వెంకటసత్యనారాయణ 1995లో 15 సెంట్ల స్థలాన్ని కొనుగోలుచేసి ఉంచారు. ప్రస్తుతం తండ్రి సత్యనారాయణ ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉండడంతో ఆ స్థలాన్ని విక్రయించి వైద్యం చేయించుకోవాలని కొండలరావు కుటుంబం భావించింది. అయితే ఆ భూమిని విక్రయించేందుకు ఎఫ్‌లైన్ సర్వే తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంది. దాంతో కొండలరావు అమలాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. ఎఫ్‌లైన్ సర్వే చేయాలంటే రూ.లక్ష చెల్లించాలని తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ డిమాండ్ చేసినట్టు తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. అయితే అంత మొత్తాన్ని ఇచ్చేందుకు మనస్కరించని కొండలరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో కొండలరావు రూ.50వేలు నగదు అందజేస్తుండగా ముందస్తు వ్యూహంతో ఉన్న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే తహశీల్దార్ కార్యాలయంలో అక్కౌంటెంట్ క్యాష్ రూ.5,88,500 ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. లంచంగా ఇచ్చిన రూ.50వేలు నగదుతో పాటు మొత్తం రూ.6,38,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లెక్క చూపకుండా ఉన్న నగదు ఎలా వచ్చిందో విచారణలో తేలుస్తామన్నారు. రామును తహశీల్దార్ కార్యాలయంలో కస్టడీలో ఉంచి తహశీల్దార్ అశోక్‌ప్రసాద్‌ను సమీపంలోనే ఉన్న ఆయన ఇంటి వద్దకు ఏసీబీ అధికారులు తీసుకువెళ్లారు. అశోక్‌ప్రసాద్, రాములను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తున్నట్టు డీఎస్పీ కిశోర్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్‌శాఖ అధ్యక్షుడిగా తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'అడపా అప్పారావు మరణం తీరని లోటు'



అడపా అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

అమలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పత్రికా రంగంలో జర్నలిస్టుగా విశిష్ట సేవలందించిన అడపా అప్పారావు మరణం పాత్రికేయులు, ప్రజలకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం గ్రామంలోని అప్పారావు స్వగృహం వద్ద బుధవారం మధ్యాహ్నం సీనియర్ జర్నలిస్టు కాట్నం వెంకటరత్నం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. అప్పారావు పాత్రికేయుడిగా పనిచేసిన కాలంలో ఎందరో జర్నలిస్టులను ఫీల్డులోకి తీసుకువచ్చిన వ్యక్తి అని కొనియాడారు. అప్పారావు పేరిట స్మారకార్థం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడంతో పాటు ఆయన విగ్రహాన్ని రూపొందింపచేసి ప్రతిష్ఠింపచేయాలని వక్తలు సూచించారు. జర్నలిస్టుగా ఐదు దశాబ్దాల పాటు పని చేసిన అప్పారావు లేనిలోటు జర్నలిస్టులకు తీరనిదని పలువురు పేర్కొన్నారు. తొలుత అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రజ్యోతి సంస్థ రాజమహేంద్రవరం బ్రాంచి మేనేజర్ సిద్దిరెడ్డి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్‌కు చెందిన పారుపల్లి శ్రీధర్, జర్నలిస్టు నేతలు మండేల శ్రీరామమూర్తి, కటికిరెడ్డి శ్రీరామారావు (బాబాయ్), నిమ్మకాయల సతీష్, ఆచంట వెంకట్, నాయకులు రంకిరెడ్డి సూర్యనారాయణ, ఉంగరాల బూరిబాబు, తాడి నరసింహారావు, కాకినాడకు చెందిన ఏలియా, ఢిల్లీకి చెందిన శర్మ, ప్రవీణ్, అనేకమంది ప్రముఖులు, మేధావులు అప్పారావు సేవల్ని కొనియాడారు.

ప్రతి ఒక్కరికీ పరిహారమివ్వాలి

- కదం తొక్కిన పోలవరం నిర్వాసితులు
- ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ముట్టడి
- సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అల్లూరి జిల్లా కలెక్టర్ హామీ



చింతూరు ఐటీడీఏ ముందు నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఒక్కటయ్యారు. ముంపు గ్రామాలన్నింటికీ 2013 భూసేకరణ ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని లోతట్టువాసులు బుధవారం ర్యాలీగా తరలివచ్చి చింతూరు ఐటీడీఏని ముట్టడించారు. విలీన మండలాలైన మల్లెతోట, గుర్రంపేట, రామవరం తదితర గ్రామాల నిర్వాసితులు పెద్దసంఖ్యలో వచ్చారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తాము ఏటా పడుతున్న వెతలు ఏకరవు పెట్టారు. ఈ కష్టాలు భరించలేకపోతున్నామని, తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నిరసన తెలిపారు. వరదల సమయంలో రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకుని తిండికి నోచుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్ల చుట్టూ వరద నీరు ఉండడంతో రోగమొచ్చినా ఆసుపత్రికి వెళ్లే దిక్కు లేకుండాపోతుందన్నారు. ముంపు గ్రామాలన్నింటినీ గుర్తించి 2013 భూసేకరణ మేరకు నష్ట పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం, పునరావాసంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో రూ.1.15 లక్షల పరిహారం తీసుకున్న భూములకు కూడా 2013 భూసేకరణ వర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నిర్వాసితులు పట్టుబట్టారు. ఈక్రమంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉన్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వాసితుల దగ్గరకు వచ్చి మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూస్తున్నామని, ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇప్పటి వరకు ప్రకటించిన ముంపు గ్రామాల కంటే అదనంగా మరికొన్ని గ్రామాలు కూడా ముంపుకు గురవుతున్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అందరికీ న్యాయం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

26న యానాంలో సాహితీ పురస్కారాల ప్రదాన సభ

యానాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాం ప్రతీఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభ, కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఈనెల 26న యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో జరగనుంది. శిఖామణీ జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కారాల గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్.. యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు అందుకోనున్నారు. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానం రాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్ళకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్‌రాం, డాక్టర్ గూటం స్వామి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే..

సుమారు 10మందికి (వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళిత సాహిత్యం) ముఖ్య అతిథుల చేతులమీదుగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారిలో డాక్టర్ కోటేశ్వరారావు, ఎస్.ఆర్.పృథ్వీ, పీఆర్ఎల్.స్వామి, బీహెచ్‌వి.మంగేష్, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్యకుమారి, పోనుగుమట్ల అశోక్‌కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌లు ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ముగిసిన శాంతిహోమం

మంత్రజలాలతో సంప్రోక్షణ



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో లోకకల్యాణార్థం చేపట్టిన శాంతిహోమం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. ఉదయం నుంచి పండితులు పంచగవ్య ప్రాశన, మూన్యుసూక్తపారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 11గంటలకు ప్రధానార్చకులు కొట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు మహదాశీర్వచనం గావించారు. హోమ పూర్ణాహుతి అనంతరం 3రోజులుగా చేపట్టిన పూజాదికాలు, మంత్రాలతో పవిత్రత పొందిన జలాలతో స్వామి ప్రధానాలయం, యంత్రాలయంతో పాటుగా ఆలయ ప్రాంగణమంతా సంప్రోక్షణ గావించారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రజలాలతో ఆలయమంతా సంప్రోక్షణ చేస్తున్న పండితులు

అక్రమంగా రవాణా చేస్తున్న కలప పట్టివేత

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.రామవరం జంక్షన్‌లో మంగళవారం రాత్రి అడ్డతీగల రేంజ్ ఆఫీసర్ షహేన్షాకు బొలేరో వాహనంపై అక్రమంగా కలప రవాణా జరుగుతుందని సమాచారం వచ్చింది. ఆయన సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. వాహనంలో రాజవొమ్మంగి మండలం సంజీవనగర్‌కు చెందిన బర్రికల రమణబాబు 18 బిళ్ల కర్ర దుక్కలను రవాణా చేస్తుండగా పట్టుకున్నామని రేంజ్ ఆఫీసర్ తెలిపారు. వీటి విలువ రూ.26,355 ఉంటుందని, కేసు నమోదు చేశామన్నారు.



అధికారులు పట్టుకున్న కలప

చాకిరేవులలో 'పల్లెనిద్ర'

పాల్గొన్న అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవో



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం చాకిరేవుల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, వీరవరం గ్రామం నుంచి వెదురునగరం వరకు వెళ్లే రహదారి ఏర్పాటు చేయాలని, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల ని, వీరవరం నుంచి కొయ్యూరు మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, కన్నేరువాగుపై రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలక సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రజలకు తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని, జిల్లాలోని గిరిజన ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దొరకయ్య, ఎంపీడీవో ఏవివి కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డి.నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమలాపురం

జీవన ఎరువుల వినియోగంతో
నాణ్యమైన ఉత్పత్తులు

● ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్


సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరి సేద్యంలో జీవన ఎరువుల వినియోగించడంతో 25శాతం మేర రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చునని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ పేర్కొన్నారు. జీవన ఎరువుల అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం మండలం చినకొత్తలంక రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో రైతులకు జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవన ఎరువుల వినియోగం వల్ల రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడమే కాకుండా భూసారాన్ని పెంచుకోవచ్చని, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. జీవన ఎరువులు వినియోగించిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా ఏవిధమైన హానీ జరగదన్నారు. జీవన ఎరువుల ఖర్చు కేవలం ఎకరానికి రూ.500 మాత్రమే అవుతుందన్నారు. ఈ సందర్భంగా జీవన ఎరువులు అంటే ఏమిటి, అవి ఎన్నిరకాలు, వాటిని ఎలా వృద్ధి చేసుకోవాలి, పొలంలో ఎలా వాడుకోవాలి, ఎంత మోతాదులో వాడుకోవాలి, వాటిని వినియోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. జీవన ఎరువులు అజస్పైరిల్లమ్, అజటోబాక్టర్, అజొల్లా, సూడోమోనాస్, ఫాస్ఫేట్‌సాల్‌బ్యూలైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ సాల్‌బ్యూలైజింగ్ బ్యాక్టీరియా వంటి జీవన ఎరువుల గురించి వివరించారు. ద్రవ రూపంలో జీవన ఎరువులు వరి పంటలో ఎలా వాడాలి, ఎంత మోతాదులో వాడాలి, ఎప్పుడు వాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. జలవనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్, ముమ్మిడివరం సబ్‌డివిజన్ వ్యవసాయ సంచాలకుడు గౌతమ్‌కుమార్, వ్యవసాయాధికారులు ప్రశాంత్‌కుమార్, మనోహర్‌లు మాట్లాడుతూ జీవన ఎరువులు వాడడం రైతులు అలవరచుకుని రసాయనిక ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

'సొసైటీ ద్వారా పశువుల దాణా పంపిణీ చేయాలి'


జేసీ నిషాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

మామిడికుదురు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరం పీఏసీఎస్ సొసైటీ ద్వారా సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేసేవిధంగా చూడాలని సొసైటీ ఛైర్మన్ ఈలి శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినతిపత్రాన్ని బుధవారం అందించారు. ఛైర్మన్ బుధవారం జేసీని మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛంతోపాటు వినతిపత్రం అందించారు. పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణాను తమ సొసైటీ ద్వారా పంపిణీ చేయాలని కోరినట్టు తెలిపారు. దీనికి జేసీ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చినట్టు ఛైర్మన్ తెలిపారు.

నేటి యువత డాక్టర్ అబ్దుల్ కలామ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


పి.గన్నవరం సీహెచ్‌సీలో అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో బుధవారం అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బీమాల వెంకటేశ్వరావు అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన అందించిన సూక్తులను ఆచరణలోకి తీసుకుంటే సమాజంలో ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. అనంతరం రూ.30వేల విలువగల ట్రస్ట్ వైస్‌ఛైర్మన్ ఆరుమిల్లి రామకృష్ణ అందించిన మూడు వీల్ ఛైర్‌లను, సాధనాల స్వామినాయుడు, గాలిదేవర మణికంఠ ఏర్పాటుచేసిన మూడు ఫ్యాన్‌లను ఎమ్మెల్యే ఆసుపత్రికి అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, రాష్ట్ర నాటకరంగ ఆకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పాలూరి ఫణి, వాసంశెట్టి కుమార్, అన్నాబత్తుల హనుమాన్, కోట రాజేంద్రప్రసాద్, కేదాశి చిన్న పాల్గొన్నారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధి రోహించాలని హెచ్ఎం సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఎస్ఎన్ మూర్తి, రామలింగేశ్వరరావు, రాంబాబు, సత్తిబాబు, అరుణజ్యోతి, పూర్ణిమ, అంజిబాబు, పీడీ లు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జయంతి

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పాశర్లపూడి హైస్కూలు, మామిడికుదురు దీప్తి స్కూలులో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం కేవీఎస్ నాగోజీరావు, ఉపాధ్యాయులు సూరిమేను శ్రీనివాసరావు, భావిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


హైస్కూలులో అబ్దుల్‌కలాం జయంతి నిర్వహిస్తున్న విద్యార్థులు

జీఎస్టీ తగ్గింపు మీ వరకు చేరిందా?

● ప్రశ్నించిన కలెక్టర్, ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల ఫలితం మీకు అందిందా? లేదా? అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మహిళలను ఆరా తీశారు. ఎస్.యానాంలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై సమావేశం నిర్వహించారు. ఎన్ని రకాల సరుకులపై ఎంత మేరకు జీఎస్టీ తగ్గిందో వారు వివరించారు. జీఎస్టీ సంస్కరణలతో పేద కుటుంబాలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పూర్తి అవగాహనతో వినియోగదారులు నిత్యావసరాల కొనుగోలు సమయంలో ధరల తగ్గింపుపై ప్రశ్నించాలన్నారు. సమావేశంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ ఛైర్మన్ అధికారి జయలక్ష్మి, టీడీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, చల్లపల్లి సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఆర్డీవో కె.మాధవి, తహసీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో డి.కృష్ణ, నియోజవర్గ అభివృద్ధి అధికారి రాంబాబు, నీటి పంపిణీ సంఘం ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు పలచోళ్ళ పద్మనాభం, ఉలిశెట్టి దొరబాబు, పినిశెట్టి నరసింహారావు, ఉపాధి ఏపీవో ఎం.వీరబాబు, పంచాయతీ కార్యదర్శి బి.గోవిందరావు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో షేక్ సలీంబాషా


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. ముమ్మిడివరం మండలం కొమానపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించి విద్యార్థులు బట్టీ పట్టి చదివే విధానానికి స్వస్తి పలికి, ప్రశ్న ఏవిధంగా ఇచ్చినా జవాబు రాసే విధంగా సంసిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం ప్రశ్నాపత్రాల్లో ప్రశ్నలు నేరుగా ఉండవని, విద్యార్థులు సొంతంగా ఆలోచించి రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలన్నారు. సబ్జెక్టుపై పూర్తి అవగాహన ఏర్పరుచుకుంటే ప్రశ్న ఏ రకంగా ఇచ్చినా జవాబులు రాయగలుగుతారన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావుకు విద్యార్థుల ప్రగతి పట్ల ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయులు కేపీస్వీ త్రిమూర్తులు, ఆర్.నాగార్జున, ఎస్ఎన్ మునేశ్వరరావు, సాధనాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణమ్మ, వికాశిని, ప్రసాద్, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.రామలక్ష్మిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి భాగస్వాములు కావాలి

● పోషణ మాసం ముగింపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే గిడ్డి


సామూహిక సీమంతాల్లో పాల్గొన్న గర్భిణులు, ఐసీడీఎస్, ప్రజాప్రతినిధులు

పి.గన్నవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పోషకాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంతంగా ఉంటారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం జరిగిన 8వ రాష్ట్రీయ పోషణమాసం ముగింపు ఉత్సవాలకు సీడీపీవో వై.విజయశ్రీ అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 276అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని వాటిలో గతనెల 17నుంచి 16వ తేదీ వరకు సుపోషిత్‌భారత్, సంక్షం భారత్‌లో భాగంగా జనఆందోళన పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి ముఖ్యంగా ఐదు అంశాలపై అవగహన కల్పించారని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందించే అవగహన కార్యక్రమాలతోపాటు పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. తొలుత పౌష్టిక ఆహారం స్టాల్‌ను సందర్శించి గర్భిణులకు సీమంతాలు చేశారు. చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలిక దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఆరోగ్యవంతమైన సామాజస్థాపనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.హెలీనా, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, పాలూరి ఫణి, నాగమణి, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, శేరుశ్రీనుబాబు, రాణి రామకృష్ణ, అనూరాజేశ్వరి, సూరయ్యకాపు, వెంకన్నబాబు, ఐసీడీయస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీటీచర్లు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతా దినోత్సవం

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సోమాని భాస్కర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్సు పర్సన్లు ర్యాలీలో పాల్గొన్నారు. మెప్మా, సచివాలయ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్లమ్ ఏరియాలోని మహిళలు, పిల్లలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు.

సామూహిక సీమంతాలు

మలికిపురం,(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎనిమిదవ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మలికిపురం మండల పరిధిలో గుడిమెళ్లంక వద్ద సామూహిక సీమంతాలు చేశారు. రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మలికిపురం మండలంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ ఇందిర మాట్లాడుతూ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గత నెల రోజుల నుంచి ప్రాజెక్టు పరిధిలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు చేశారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ అంజలి, సూపర్‌వైజర్లు సరోజిని, హైమావతి, చంద్రకళ, విజయభారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి

అంబాజీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణం స్పందించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హెచ్ఎంల సంఘ అధ్యక్షుడు చెవ్వూరి రవి డిమాండ్ చేశారు. అంబాజీపేట ఎంఆర్సీ భవనంలో మండల పరిధిలో పనిచేస్తున్న హైస్కూల్స్ హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. హైస్కూల్స్‌లో 30ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు ప్రతిబంధకంగా తయారైందని, దీనిని వెంటనే పరిష్కరించి ప్రధానోపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవోలుగా నియమించి జిల్లాపరిషత్ హెచ్ఎంలను అవమానపరచటం సరికాదని స్కూల్ అసిస్టెంట్ల స్థానే జిల్లా పరిషత్ హెచ్ఎంలను నియమించాలని కోరారు. పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ వారి ప్రమేయం తగ్గించి డీసీఈబీల ద్వారా పరీక్షాపత్రాలు ముద్రించే విధానం పునరుద్ధరించాలని కోరారు. అలాగే 12వ పీఆర్సీని ప్రకటించాలని బకాయిలను తక్షణం విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మో కా ప్రకాష్, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

● రాష్ట్ర టీడీపీ టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి సునీల్



పి.గన్నవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర టీడీపీ టీఎన్ ఎస్ఎఫ్ కార్యదర్శి నక్కా సునీల్ అన్నారు. దేశంలో ముంబై మొదటి ఆర్థిక రాజధాని అయితే నవ్యాంధ్రప్రదేశ్‌లో విశాఖ రెండో రాజధానిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోకి గూగుల్ సంస్థ రాకకు అంగీకారం తెలపడంతో ఆయన బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకు వస్తున్నారని ఆయన వివరించారు. 12 నెలలపాటు శ్రమించి జాతీయ స్థాయి పాలసీల్లో మార్పులు చేయించి గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావడంలో లోకేష్ కృషి అభినందనీయమన్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఏపీలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం తోపాటు వ్యవసాయం, వైద్యం, విద్యా రంగాలు మెరుగుపడతాయన్నారు.

గూగుల్ రాకతో హర్షం

అమలాపురంరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయడంపట్ల డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ హర్షం వ్యక్తం చేసింది. నడిపూడిలోని బుధవారం సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే విశాఖపట్నానికి గూగుల్ వచ్చిందన్నారు. వారి కృషిని అభినందిస్తూ వక్తలు మాట్లాడారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కాప నాగభూషణం, కార్యదర్శి చాట్ల సత్యనారాయణ, డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, మోకాటి అమ్మిరాజు, మంద వెంకటేశ్వరరావు, ఉండుర్తి సత్యనారాయణ, నూటుకుర్తి మూర్తి, కొడమంచిలి కృష్ణ, కొడమంచిలి సాయికుమార్, ఈతకోట రమణ, చుట్టుగుళ్ల రమణ, వెంకట్రావు పాల్గొన్నారు.

చమురు సంస్థల కార్యకలాపాల అడ్డగింత

యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దరియాలతిప్ప సొసైటీ భూములవద్ద ఆగస్టు 22న జరిగిన ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ సంఘటనకు సంబంధించిన నెలలు గడుస్తున్న సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గత రెండురోజులుగా సంస్థ మరమ్మతులు చేయడానికి సిద్ధం కావడంతో కార్యకలాపాలను స్థానికులు అడ్డుకున్నారు. దరియాలత్పి గ్రామపెద్దలు, ప్రజలు అడ్డుకుని నిరసన తెలుపుతున్నారు. సంఘటన జరిగిన మూడునెలలు గడుస్తున్న సంస్థ ఒక్క సమావేశం ఏర్పాటుచేయకపోవడం చాలా దారుణమన్నారు. ప్రస్తుతం వరదలు తగ్గుముఖం పట్టడంతో మరమ్మతుల పనులు చేయడానికి సిద్ధం కావడంతో సమీపంలో ఉన్న ప్రభావిత ప్రాంతాల వారికి న్యాయం చేయాలని కోరారు. స్థానికులు చెబుతున్న ఆందోళనకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌లు మద్దతు ప్రకటించారు. ఈ సంఘటనలో ప్రజలకు న్యాయం జరిగేవరకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

హిందూ దేవాలయాలను శక్తి కేంద్రాలుగా మార్చాలి


మాట్లాడుతున్న తులసి సూర్యప్రకాష్

మామిడికుదురు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను శక్తి కేంద్రాలుగా మార్చాలనే కార్యాచరణకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని విజయవాడ ప్రాంత సహ సంయోజక్ తులసి సూర్యప్రకాష్ కోరారు. అప్పనపల్లి బాలబాలాజీస్వామి సన్నిధిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆదిజాంబవ సమావేశం బుధవారం జరిగింది. మన దేవాలయాలను మనమే పరిరక్షించుకునేందుకు కుటుంబ సమేతంగా దేవాలయాలను దర్శించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీనివాసరావు, వెంకటశివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో కేంద్ర బృందం పరిశీలన


లక్కవరంలో ప్రభుత్వ పథకాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మలికిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలోని లక్కవరం, గొల్లపాలెం గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలుతీరును కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. పంచాయతీరాజ్ పనులు, ఉపాధి పనులు, హౌసింగ్ లబ్ధిదారుల వివరాలతోపాటు పించన్లను పరిశీలించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించి పథకాల వివరాలు తెలుసుకున్నారు. 2021-22లో మంజూరైన గృహ లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ బృందంలో ఉమేష్‌కుమార్‌రామ్, మయూర్‌వర్మ, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏపీవో లక్ష్మి, ఏపీఎం సయ్యద్, ఈవోపీఆర్డీ అబ్బాస్‌అలీ పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించాలని రిలే దీక్షలు

అమలాపురంరూరల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): బండార్లంక గ్రామ పంచాయతీలో ఏడాదిగా నిలిచిపోయిన చెత్త సేకరణను పునరుద్ధరించాలని వైసీపీ ఆధ్వర్యంలో చెత్తపై పోరు పేరుతో బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. ఎక్కడికక్కడ గ్రామంలో చెత్త పేరుకుపోవడం వల్ల గ్రామస్థులు రోగాలబారిన పడుతున్నారని విమర్శించారు. బండార్లంక పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సందర్శించి సంఘీభావం తెలిపారు. తొలిరోజు రిలే దీక్షల్లో పంచాయతీ పాలకవర్గం జాన జగదీశ్‌చంద్రగణేష్, కట్టా చండీప్రియ, కూర్మా క్రీస్తుబాబుతోపాటు నాయకులు సరెళ్ళ రామకృష్ణ, ఇనుమర్తి లింగమూర్తి, చింతా ఉమామహేశ్వరరావు, దంగేటి రుద్ర, కారుపర్తి మల్లేశ్వరరావు, అంకం పెదరాజు, పాల్గొన్నారు.



బండార్లంక పంచాయతీ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న దృశ్యం

పరీక్షల నిర్వహణపై ఆకస్మిక తనిఖీ


ఇందుపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న సూర్యప్రకాశం

అమలాపురంరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ2 పరీక్షలను అమలాపురం ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పనితీరు పచ్చదనం, పరిశుభ్రత, కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి హెచ్ఎం లంక రాణితోపాటు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ, ఉపాధ్యాయ స్టాఫ్ సెక్రటరీ గుబ్బల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులవారికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం


కుమ్మర్ల సామాజికవర్గంతో మాట్లాడుతున్న ఈశ్వర్

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల కులాలను ప్రోత్సహిస్తూ చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో బుధవారం కుమ్మర్ల స్థితిగతులపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని కుమ్మర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా, ప్రజా అవసరాలకు అనుగుణంగా మట్టితో వస్తువులను తయారుచేసేలా కుమ్మర్లు ముందుకు రావాలన్నారు. అందుకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో కేటాయించిన శ్మశానవాటిక స్థలం ఆక్రమణలకు గురైందని ఆయన దృష్టికి తీసుకురాగా ఈ సమస్యను చర్యలు తీసుకుంటానని ఈశ్వర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ సంక్షేమ డైరెక్టర్ మాచవరపు విజయకుమారి, కోనసీమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ బ్రహ్మం, ముమ్మిడివరం సంఘ అధ్యక్షుడు డి.శ్రీరామచంద్రమూర్తి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలకు చెందిన కుమ్మరి, శాలివాహన సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

అంతర్వేది, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో పశు సంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కాకినాడవారి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. సుమారు 50 పశువులను ఈ శిబిరంలో పరీక్షించి అవసరమైన వాటికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లు, లివర్ టానిక్స్, మినరల్ బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో ఉండపల్లి అంజి, యెనుముల తాతాజీ, పశువైద్యాధికారులు డాక్టర్ బీబీ సంపత్‌కుమార్, డాక్టర్ తోట నవీన్, పారా మెడికల్ సిబ్బంది పీవీఎల్ఎస్ మూర్తి, బి.జానకీరామారావు, సతీష్, ఎన్.శ్రీను పాల్గొన్నారు.

నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోవాలి

● ఐటీ మంత్రి లోకేశ్‌తో మల్లాడి భేటీ


నారా లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లాడి

యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాల్లో చమురు సంస్థల కార్యకలాపాల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకోవాలని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు తాడేపల్లిలోని సీఎం స్వగృహంలో బుధవారం ఉదయం కలిశారు. సుమారు 70నిమిషాలపాటు యానాం జిల్లా మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా దరియాలతిప్ప సొసైటీ భూముల వద్ద ఆగస్టు 22న జరిగిన ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ పేలుడు ఘటనకు సంబంధించి యానాంతోపాటు సరిహద్దు జిల్లాలో మత్స్యకారులకు, ఇతరవర్గాల ప్రజలకు జరిగిన నష్టం, గోదావరిలో నశించిపోయిన అపారమైన మత్స్య సంపద, పర్యావరణ కాలుష్యం తదితర అంశాల గురించి చర్చించారు. కేజీ బేసిన్‌లో చమురు సంస్థలు నిర్వహిస్తున్న కార్యకలాపాల వల్ల ఏపీ కోస్తాతీరంలో తుని మొదలుకొని యానాంతో పా టు నరసాపురం వరకు మత్స్యకారులకు, ఇతర అన్ని వర్గాల ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏవిధంగా దెబ్బ తింటున్నారన్న అంశాలను లోకేశ్‌కు మల్లాడి వివరించారు. ఏపీ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులకు ఇచ్చిన వినతిపత్రం నకలును మంత్రి లోకేశ్‌కు మల్లాడి అంజేశారు. ముందుగా ఐటీ మంత్రి లోకేశ్‌ను ఢిల్లీ ప్రతినిధి మల్లాడి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మల్లాడిని మంత్రి లోకేశ్ శాలువాతో సత్కరించారు.

క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులతో క్రీడాకారులు

అమలాపురంరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న క్రీడాకారులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీరామచంద్రమూర్తి క్రీడా దుస్తులను బుధవారం అందజేశారు. క్రీడల పట్ల ఆయనకు ఉన్న ఆసక్తిని పలువురు అభినందించారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ రాంబాబు రూ.5వేలతో వాలీబాల్, త్రోబాల్‌ను అందజేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. దీక్షా శిబిరాన్ని న్యాయవాది కన్నీడి వెంకటరమణ, సీపీఎం నాయకులు సకిలే సూర్యనారాయణ, మెండి కృష్ణంరాజు, నీలం చినబాబు, పందిరి శ్రీనివాసరావు, బడుగు భీమేశ్వరరావు, జంగా నాగేశ్వరరావు, పి.రాంజీ, రమణ పాల్గొని సంఘీభావం తెలిపారు.

అన్నవరం సత్యదేవుడి దివ్య ప్రచార రథానికి స్వాగతం

ఐ.పోలవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా అన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దివ్య ప్రచార రథం బుధవారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. వీరేశ్వరస్వామి దేవస్థానం అర్చక, పురోహిత బృందంతో పాటు భక్తులు స్వామివారి ప్రచార రథానికి స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. .


అన్నవరం ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు



మండపేటలో జరిగిన జీఎస్‌టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

అధికారుల తీరు విచారకరం

జీఎస్‌టీ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ అమలులో వాణిజ్య పన్నులశాఖ అధికారుల తీరుపై మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండపేటలోని లయన్స్ క్లబ్ హాల్‌లో జరిగిన జీఎస్‌టీ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా రూ.8వేల కోట్లమేర నష్టాన్ని భరించేందుకు సిద్ధపడిందన్నారు. జీఎస్‌టీ తగ్గిన తర్వాత వాటి ధరల్లో వ్యత్యాసం ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆయా దుకాణాల వద్ద కొత్త ధరల బోర్డులను ఏర్పాటు చేసి వినియోగదారులకు తెలిసేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. దుకాణాల వద్ద బోర్డుల ఏర్పాటుకు అధికారులు 13 రోజులు గడువు అడగ్గా వాణిజ్య పన్నులశాఖ అధికారులపై ఆయన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడని జీఎస్‌టీ తగ్గింపు ధరలు ఎవరి కోసమని ఆయన అధికారులను ప్రశ్నించడంతో వాళ్లంతా నీళ్లు నమిలారు. మూడు రోజుల వ్యవధిలో బోర్డులు ఏర్పాటు చేయకుంటే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, ఎంపీపీ ఉండమట్ల వాసు, వి. ప్రసాదరావు, బీజేపీ నాయకుడు కె.సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మండపేట ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

కొత్తపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట విద్యా బాలమందిర్‌లో బుధవారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్.శివ రత్నం, సుధాకర్, హసన్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నేటి తరాలకు స్ఫూర్తి అని అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆర్‌ఎంవోసీ కలాం సన్నిహితులు సంకురాత్రి గంగాధర శ్రీనివాస్ అన్నారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని ఎంపీఎఫ్ పాఠశాలలో బుధవారం జయంతిని నిర్వహించారు. తొలుత అబ్దుల్‌కలాం చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ విద్యార్థులకు కలాం విజయాలను వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు, విద్యార్థులు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ గ్రామసభ వాయిదా

కపిలేశ్వరపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురంలో బుధవారం జరగాల్సిన ఉపాధి హామీ గ్రామసభను జనం లేరంటూ వాయిదా వేసేశారు. ఈనెల 6 నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభమైన ఉపాధి హామీ ఫైనల్ గ్రామసభలు షెడ్యూల్ ప్రకారం జరగకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వాయిదా వేసేసుకుంటున్నారు. ఈనెల 11న జరగాల్సిన గ్రామసభలు కూడా ముందు రోజు 10న జరిపేశారు. ఇలాగైతే షెడ్యూల్ ఎందుకు పెడుతున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. అచ్యుతాపురం గ్రామసభ ఉన్నట్టు తెలియపర్చకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిసింది. గ్రామ ఎంపీటీసీ, మండల విప్ అయిన తనకు కూడా గ్రామసభ ఉన్నట్టు తెలియపర్చలేదని దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పలివెల మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు గ్రామసభలు నిర్వహించుకోవచ్చా అని ఆయన ప్రశ్నించారు. ఉపాధి గ్రామసభ వాయిదాపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జ్ ఏపీవో రజిత్‌సింగ్‌ను వివరణ కోరగా గ్రామసభకు ఎవరూ రావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తెలపగా గురువారానికి వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.



వెదురుమూడిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించిన దృశ్యం

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోండి

కపిలేశ్వరపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వెదురుమూడి గ్రామంలోని బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో యు.పూర్ణిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.కుమారి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించారు. గ్రామ కార్యదర్శి శారద మాట్లాడుతూ అంగన్‌వాడీలు అందించే సేవలను వినియోగించుకుని 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు బోణం నానిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను చిన్నారులు, గర్భవతులు, బాలింతలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రమ టీం సభ్యులు రమణయ్య, అంగన్‌వాడీ టీచర్లు ఎం.జానకిదేవి, వి.నాగమణి, హెల్పర్ శ్రీలక్ష్మి, శ్రమ సేవా సంస్థ సభ్యులు దుర్గారావు, భవాని, శారద, నాగరాజు, గ్రామస్తులు, బాలింతలు, గర్భవతులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు రామాలయంలోని సీతమ్మవారిని తాకిన సూర్య కిరణాలు

సీతమ్మవారిని తాకిన సూర్య కిరణాలు

ఆలమూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు గాంధీబొమ్మ సెంటర్‌లోనున్న రామాలయంలోని ప్రధాన విగ్రహాలను బుధవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ముఖ్యంగా సీతమ్మవారి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకడంతో భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయని శైవాంగ వేద పండితుడు కాళ్లకూరి సూరిపండు అన్నారు. ఇది తెలిసిన వెంటనే పలువురు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు.



బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్ కుమార్ రెడ్డికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న దృశ్యం

కిరణ్ కుమార్ రెడ్డికి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి బుధవారం రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి స్వాగతం పలికారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన్ను లీలాకృష్ణ కలిసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



పి.గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర టీడీపీ టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నక్కా సునీల్ అన్నారు. దేశంలో ముంబై మొదటి ఆర్థిక రాజధాని అయితే నవ్యాంధ్రప్రదేశ్‌లో విశాఖ రెండో రాజధానిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోకి గూగుల్ సంస్థ రాకకు అంగీకారం తెలపడంతో ఆయన బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకు వస్తున్నారని ఆయన వివరించారు. 12 నెలలపాటు శ్రమించి జాతీయ స్థాయి పాలసీల్లో మార్పులు చేయించి గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో లోకేష్ కృషి అభినందనీయమన్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఏపీలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం తోపాటు వ్యవసాయం, వైద్యం, విద్యా రంగాలు మెరుగుపడతాయన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): వాడపల్లిలో బుధవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పలు పూజలు జరిపారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధి హామీలో ఈకేవైసీతో
బోగస్ మస్తర్లకు చెక్

మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న బోగస్ మస్తర్ల మాయజాలంతోపాటు ఇతర అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులు చేసే శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది. నవంబరు 7వ తేదీలోపుగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించింది.



మండపేటలో ఉపాధి పనులు చేసేందుకు తరలివెళుతున్న శ్రామికులు (ఫైల్)

● **గతంలో ఇలా..** గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర సహాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో పాటు పలు ఫిర్యాదులు వచ్చాయి. శ్రామికులు పనికి రానప్పటికీ కొందరు మస్తర్లు వేస్తున్నట్టు తెలిసింది. ఎక్కువ పనిచేసే శ్రామికులకు కొలతలు తగ్గించి, దాన్ని దొంగమస్తర్ల వారికి సర్దుబాటు చేస్తున్నారు. దీంతో నిజంగా పనిచేసే శ్రామికుడికి పనికి తగ్గ వేతనం అందేది కాదు. పనులు చేయని వారికి సైతం పనిచేసిన వారితో సమానంగా నగదు జమయ్యేది. స్థానికంగా లేకున్నా ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లిన వారికి సైతం వారి ఖాతాల్లో నగదు జమవుతున్న సంఘటనలు వున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త విధానం ద్వారా ఉపాధి హామీ పనుల్లో జరిగే అవకవతకలకు చోటు లేకుండా పనులకు హాజరయ్యే వారికే వేతనం అందేలా నూతన విధానం అమల్లోకి తీసుకు వచ్చింది. శ్రామికులకు ఈకేవైసీ నమోదు పూర్తయితే బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట పడుతుంది. ఈ ప్రక్రియ వచ్చేనెల 7వ తేదీకల్లా పూర్తికావాల్సి ఉంది. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఇక నుంచి పనిచేసే చోటే శ్రామికులకు రోజూ రెండు విడతలు ఫేస్ రీడింగ్ నమోదు చేస్తారు. దీనివల్ల ఒకరి బదులు మరొకరు ఫొటోలు దిగి పనిచేసినట్టు చూపినా డబ్బులు తీసుకోవడం కుదరదు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో చాలా వరకు ఈకేవైసీ పూర్తయిందని వచ్చేనెల 7వ తేదీకల్లా పూర్తిస్థాయిలో ఈకేవైసీ పూర్తి చేస్తామని జిల్లా ఉపాధి హామీ పీడీ ఉమామహేశ్వరావు తెలిపారు.



రాయవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం ఇవ్వాలి

రాయవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయవరం బాణసంచా ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారంనాటికల్లా నష్టపరిహారం ఇవ్వకుంటే బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపడతామని ప్రజా సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. రాయవరం తహసీల్దార్ బీవీ భాస్కరరావుకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు దూళి జయరాజు, పీడీఎస్‌యు నాయకుడు బి.సిద్దు ఐఎఫ్‌టీయు నాయకుడు చింతా రాజారెడ్డి, ముస్లిం జేఏసీ నాయకుడు ఎండీ ఖరీంఖాదర్, ఎండీ షఫీ, బీసీసెల్ నాయకులు మల్లువలసల గణపతి, లంక రాజేష్, చంద్రమళ్ల రామకృష్ణ, రాయవరం సర్పంచ్ సి.రామకృష్ణ సీపీఐ నాయకులు జేజి బాబు, నవీన్, పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం

రావులపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డు తీసుకున్న రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్‌ను బుధవారం పలువురు అభినందించారు. రావులపాలెం డిపోను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఆయన కృషి అభినందనీయమని వక్తలన్నారు. రావులపాలెం డిపో గ్యారేజ్ సిబ్బంది, సూపర్‌వైజర్ల అధ్వర్యంలో డిపో మేనేజర్ కుమార్‌ను బుధవారం సత్కరించారు. డిపోలో ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షిస్తూ కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది మద్యానికి బానిసలు కాకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు.



డీఎం కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం



మనకపల్లిలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో నాగరాజు

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలి

కె.గంగవరం అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేలా కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో-1 నాగరాజు సూచించారు. బుధవారం ఆయన మసకపల్లి, భట్లపాలిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లోని రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం రికార్డులు వంటివి తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నూతన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ అభినందన

కె.గంగవరం అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 ద్వారా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను బుధవారం యూటీఎఫ్ నాయకులు అభినందించారు. భట్లపాలిక, సుందరపల్లి, పామర్రు, గంగవరం తదితర పాఠశాలల్లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్ కుమార్, మండల నాయకులు దాసరి శ్రీను, రవి, గణేష్, ప్రేమ్‌కుమార్, సతీష్, శివ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



కూళ్లలో నూతన ఉపాధ్యాయులను అభినందిస్తున్న దృశ్యం

పరీక్షా కేంద్రాల పరిశీలన

రాయవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న సెల్ఫ్ అసైన్‌మెంట్-2 పరీక్షల కేంద్రాన్ని ఏంఎవో రాంబాబు బుధవారం పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కిచెన్ గార్డెన్, సమగ్రశిక్ష ద్వారా సరపరా చేసిన బుక్స్‌ను, లైబ్రరీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

రాయవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య వెలుగు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని 47 మహిళా సంఘాలకు ఎంపిక చేసిన వలంటీర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎనర్జీ ఎస్.11 నుంచి 41 మంది వలంటీర్‌లు, ఉపాధ్యాయులు వారికి శిక్షణ ఇచ్చారు. ఆంధ్ర ఉల్లాస్ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించడంతోపాటు హాజరైన వారికి పుస్తకాలు, మెటీరియల్ అందజేశారు. టీడీపీ మండల నాయకుడు ఉండమట్ల రాంబాబు, మహిళా సమాఖ్య ఏపీఎం కె.నాగేశ్వరరావు, ఎనర్జీ ఏపీవో జే.సుధారాణి, వలంటీర్లు, ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో చెట్ల అక్రమ నరికివేతపై ఫిర్యాదు

మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలోని లేఅవుట్‌లో అక్రమంగా నరికివేసిన చెట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు లేఅవుట్‌లో నాటిన చెట్లను అనుమతులు లేకుండా నరికేసి విక్రయించడంతోపాటు పర్యావరణానికి విఘాతం కలిగించారని ఆయన ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.



సభలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీవైఈవో

విద్యార్థి దశ నుంచే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

రాయవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసే బాధ్యత పీఈటీలపై ఉందని రామచంద్రపురం డివిజన్ డీవైఈవో పి.లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. రాయవరంలో బుధవారం మండల విద్యాధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీవైఈవోతోపాటు, ఏఈవో రాంబాబు హాజరయ్యారు. వారిద్దరు నూతనంగా నియమితులై విధుల్లో చేరిన వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 సూర్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పశుగ్రాసం పెంచితే
నూరుశాతం సబ్సిడీ లభ్యం

• రైతులకు పశుసంర్థకశాఖ సూచన • ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినతి



మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడిపశువుల పెంపకానికి అవసరమైన పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తున్నదని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు పలు సలహాలు చేశారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం పెంచేందుకు రైతులకు రాయితీని అందిస్తూ పాడి పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచుకునే రైతులకు నూరుశాతం రాయితీని కలిస్తున్నట్టు తెలిపారు. పశుగ్రాసం పెంచుకునేందుకు అవసరమైన విత్తనాలతో పాటు ఎరువులకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇస్తున్నదని ఆయన తెలిపారు. ఒక్కో రైతు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంటుం దని తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి రైతుకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఐదెకరాలలోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు దీనికి అర్హులన్నారు. రైతు సేవా కేంద్రం లేదా మండలంలో పశు వైద్యాధి కారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులు నీటివసతి కలిగిన భూములు పరిశీలించి రైతులను ఎంపిక చేస్తారని తెలిపారు. అనుమతి లభించిన రైతులు అధికారుల పర్యవేక్షణలో పశుగ్రాసం పెంపకం చేపట్టాల్సి ఉంటుందన్నారు.

పాడి రైతులకు వరం

పాడి పశువులకు తగిన పౌష్టికాహారం సులభంగా లభిస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుందన్నారు. సాగు చేసిన రైతులకు వ్యవసాయ విత్తన ఎరువుల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కోరారు.



సత్యదేవుడి రథానికి స్వాగతం

ఐ.పోలవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామి దివ్య ప్రచార రథం బుధవారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. వీరేశ్వరస్వామి దేవస్థానం అర్చక, పురోహిత బృందంతో పాటు భక్తులు స్వామివారి ప్రచార రథానికి స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు.

నిరక్షరాస్యులను తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

ఆలమూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యులు చేయడమే ఉల్లాస్ లక్ష్యమని పలువురు వక్తలన్నారు. ఇందులో భాగంగా దశలవారీగా శిక్షణ ఇస్తామని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ విజయ భాస్కరరావు అన్నారు. ఆలమూరులోని స్త్రీశక్తి భవనంలో బుధవారం 212 మందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. రెండో దశలో 2,120 మంది నిరక్షరాస్యులను గుర్తించామని దీనిలో 1,680 మంది మహిళలు, 440 మంది పురుషులను గుర్తించామన్నారు. వీరికి ఈనెల 21వ తేదీ నుంచి జనవరి వరకు శిక్షణ ఇస్తామని వారు తెలిపారు. కార్యక్రమం లో ఎంపీఎం సత్తిబాబు, ఎంపీవో అరుణ్‌కుమారి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉల్లాస్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు